ఎంఎన్‌సీ కంపెనీలో ఉద్యోగాలంటూ..
రూ.46.19 లక్షలు మోసం

బెంగళూర్‌కు చెందిన సైబర్ చీటర్ అరెస్టు

సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ): మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగాలిప్పిస్తామంటూ టెలీగ్రామ్ యాప్‌లో ప్రకటనలిచ్చి ఏడుగురి వద్ద నుంచి రూ.46.19 లక్షలు వసూలు చేసిన బెంగళూర్‌కు చెందిన ఓ సైబర్ నేరగాడిని సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. సైబర్‌క్రైమ్స్ డీసీపీ కవిత కథనం ప్రకారం.. బెంగళూర్ దొండబెల్లాపూర్‌కు చెందిన ఎస్. మహేశ్ టెలీగ్రామ్ యాప్‌లో ఎంఎన్‌సీ కంపెనీలో ఉద్యోగాలంటూ.. ఒక ప్రకటన ఇచ్చాడు. దీనిని చూసిన యూసుఫ్‌గూడకు చెందిన బాధితుడు, అతడి స్నేహితుడు అందులోని ఫోన్ నంబర్‌లో సంప్రదించారు. ఎంఎన్‌సీ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని, అయితే కొంత ఖర్చవుతుందంటూ నమ్మించాడు. మొదట రిజిస్ట్రేషన్ ఫీజు అంటూ వసూలు చేయడం ప్రారంభించాడు. అనంతరం ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించి, అది ఫలానా కంపెనీ నుంచే నిర్వహిస్తున్నామని బాధితులను నమ్మించాడు. ఇంటర్వ్యూల తరువాత మీ ప్యాకేజీలు ఫిక్స్ అయ్యాయంటూ నమ్మించి.. దఫ దఫాలుగా ఏడుగురి నుంచి రూ. 46.19 లక్షలు వసూలు చేశాడు. ఆ తరువాత ఎంఎన్‌సీ కంపెనీలో ఉద్యోగమంటూ నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు పంపించాడు. బాధితులు వాటిని పరిశీలించి వాకబు చేయగా అన్ని నకిలీవని గుర్తించి, 2023లో సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు బృందం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేపట్టింది. నిందితుడు బెంగళూర్‌లో ఉన్నట్లు గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడి వద్ద నుంచి మూడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

రక్తపు మడుగులో యువకుడు..

వెంగళరావునగర్, మే 5: ఎస్‌ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ ఎదుట ఓ యువకుడు తీవ్ర గాయాలతో రక్తపు మడుగులో కనిపించడం కలకలం రేపింది. స్థానికుల సమాచారంతో పోలీసులు బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఆదివారం రాత్రి 9.15 గంటల సమయంలో సుమారు 30 ఏండ్ల వయసున్న ఓ యువకుడు రక్తపు గాయాలతో ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ వెనుక వైపు గేటు వద్ద పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్రమత్తమైన పోలీసులు ఆ యువకుడిని 108 అంబులెన్స్ ద్వారా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు తన పేరు ప్రసాద్ అని.. గుడిమల్కాపూర్‌లో ఉంటానని చెప్పాడు. తలకు తీవ్ర గాయాలు ఉండటంతో వాహనం ఢీకొని ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఆఫ్టర్ 9 పబ్‌లో అశ్లీల నృత్యాలు

టాస్క్‌ఫోర్స్ దాడుల్లో పట్టుబడ్డ 32 మంది యువతులు

నిర్వాహకులు సహా కస్టమర్లపై కేసు నమోదు

పబ్‌లో అశ్లీల నృత్యాలు చేస్తున్న యువతులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

బంజారాహిల్స్ రోడ్ నం. 14లోని ఆఫ్టర్ 9 పబ్

బంజారాహిల్స్, మే 5: కస్టమర్లను ఆకర్షించేందుకు యువతులను ఎరగా వేయడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న బంజారాహిల్స్ రోడ్ నం. 14లోని ఆఫ్టర్ 9 పబ్‌పై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నిర్వహించిన దాడుల్లో 32 మంది యువతులు అశ్లీల నృత్యాలు చేయడంతో పాటు గలీజు పనులు చేస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. ఈ వ్యవహారంలో పబ్ నిర్వాహకులతో పాటు కస్టమర్లపై కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 14లోని ఆఫ్టర్ 9 పబ్‌లో గత కొంతకాలంగా అశ్లీల నృత్యాలు చేస్తున్నారని, పబ్‌లోకి వచ్చే వారిని ఆకర్షించేందుకు వివిధ ప్రాంతాల నుంచి యువతులను తీసుకొస్తున్న పబ్ నిర్వాహకులు డబ్బులు దండుకుంటున్నారని ఫిర్యాదులు వచ్చాయి. దీంతో శనివారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు పబ్‌పై దాడులు నిర్వహించారు. భారీ శబ్దాలతో డీజే నడిపిస్తుండటంతో పాటు మద్యం మత్తులో ఉన్న యువకులను రెచ్చగొట్టేలా నృత్యాలు చేస్తున్న యువతులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. పబ్ గేటు వద్దనే యువతులను సరఫరా చేస్తూ డబ్బులు గుంజుతున్నట్లు తేలింది. దీంతో అదనపు ఆదాయం కోసం పబ్ నిర్వాహకులు అసాంఘిక కార్యక్రమాలు ప్రోత్సహించడంతో పాటు అశ్లీల నృత్యాలు చేయిస్తున్నారని గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరు పబ్ మేనేజర్లు, క్యాషియర్, డీజే ఆపరేటర్, ఐదుగురు బౌన్సర్లు, 131 మంది కస్టమర్లు, 32మంది యువతులను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారిని బంజారాహిల్స్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీసులు నిందితులపై ఐపీసీ 294, 188 సెక్షన్లతో పాటు సీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గతంలో కూడా ఆఫ్టర్ 9 పబ్‌పై పలు ఆరోపణలు రావడంతో హెచ్చరించామని.. అయినా పట్టించుకోకుండా అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు తేలడంతో పబ్‌ను సీజ్ చేయించనున్నామని, పబ్ లైసెన్స్ కూడా రద్దు చేయాలని ఎక్సైజ్ శాఖకు సిఫార్సు చేయనున్నామని పోలీసులు తెలిపారు.

ఆధారాలు చూపించి..నగదును తీసుకెళ్లండి

రూ.5.61 కోట్ల నగదులో.. రూ.4.27 కోట్లు విడుదల

సిటీబ్యూరో, మే 5, (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు జిల్లాలో నమోదైన 150 కేసుల్లో రూ.50 వేలు మించి ఆధారాలు లేని రూ.5.61 కోట్ల నగదుకు సంబంధించి జిల్లా గ్రీవెన్స్ కమిటీ (డీజీసీ) సిఫారసు చేయగా, ఆధారాలు చూపడంతో 146 కేసులకు సంబంధించి రూ.4.27 కోట్లను డీజీసీ ద్వారా విడుదల చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్ తెలిపారు. సీజ్ చేసిన నగదులో రూ.10 లక్షలకు మించి పట్టుబడిన నాలుగు కేసులకు సంబంధించి.. రూ. 66,55,000లు ఆదాయ పన్ను, కమర్షియల్ ట్యాక్స్ శాఖలకు రిఫర్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా 3 కేసుల్లో రూ. 66,49,000లు ఆదాయ పన్ను శాఖ సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ కంటోన్మెంట్‌కు సంబంధించి 10 కేసుల్లో సీజ్ చేసి, డీజీసీకి సిఫారసు చేసిన రూ.51,04,015 నగదు, ఇతర వస్తువులలో ఇప్పటి వరకు జిల్లా గ్రీవెన్స్ కమిటీలో సరైన ఆధారాలు చూపిన ఏడుగురికి రూ.15,99,800 నగదు, ఇతర వస్తువులు విడుదల చేసినట్లు తెలిపారు. మూడు కేసులకు సంబంధించిన రూ. 35,04,215ల నగదును ఆదాయ పన్ను శాఖకు రెఫర్ చేసినట్టు డీఈఓ తెలిపారు. ఏదైనా సందేహాలు ఉంటే గ్రీవెన్స్ కమిటీ చైర్మన్, అడిషనల్ కమిషనర్ సరోజ సెల్ నంబర్ 9618888110, కమిటీ కన్వీనర్ శరత్ చంద్ర సెల్ నంబర్ 9177872240లో సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

కత్తులతో బీభత్సం

పండ్ల దుకాణం నిర్వాహకులపై 20 మంది దాడి

షాపులకు నిప్పు పెట్టిన దుండగులు..

కాలిపోయిన దుకాణాలు

దహనమైన పండ్ల దుకాణాలు

వనస్థలిపురం, మే 5 : వనస్థలిపురం పరిధిలోని సాగర్ కాంప్లెక్స్ వద్ద ఆదివారం సాయంత్రం ఉద్రిక్తత నెలకొంది. సాగర్ హైవే పక్కన ఉన్న పండ్ల దుకాణం నిర్వాహకులపై ఒకేసారి 20 మంది దాడి చేశారు. దీంతో దుకాణాదారులు తిరగబడ్డారు. షాపులో ఉన్న కత్తులతో ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. పలువురికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేలోపు దాడి చేసిన వ్యక్తులు పరారయ్యారు. కాగా, పండ్ల దుకాణాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించగా పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటన వనస్థలిపురం ప్రాంతంలో సంచలనం సృష్టించింది. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. నగరంలోని చాంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన షఫీ అహ్మద్‌ఖాన్, సాధిక్ అలీ, మహబూబ్ పాషా, బాబా మహ్మద్ ఒకే కుటుంబసభ్యులు. సాగర్ కాంప్లెక్స్ ఎదురుగా.. సాగర్ రహదారి పక్కన పండ్ల దుకాణం నిర్వహిస్తున్నారు. గత నెల 18న గుర్తు తెలియని వ్యక్తులు వీరి షాపు వద్దకు వచ్చి బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకపోవడంతో షఫీపై దాడిచేసి రూ. 10వేలు లాక్కొని వెళ్లిపోయారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో 20 మంది ఒకేసారి వచ్చి వీరి షాపుపై దాడి చేశారు. షాపులో ఉన్న కత్తులను తీసుకొని దాడికి పాల్పడ్డారు. అనంతరం పండ్ల షాపు, కొబ్బరి బోండం షాపులను తగులబెట్టి పారిపోయారు. మంటలు భారీగా రావడంతో స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. కాగా, వచ్చిన వ్యక్తుల్లో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వచ్చింది ఎవరు.. దాడి చేసింది ఎవరు.. గాయాలయ్యింది ఎవరికీ.. అనే విషయం తెలియడం లేదు. పోలీసులు కూడా ఈ విషయమై ఓ కొలిక్కి రాలేకపోతున్నారు. ఘటనా స్థలంలో సాధిక్ అలీ, షఫీ, మహబూబ్ పాషాను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. చికిత్స కోసం వారిని దవాఖానకు తరలించారు. కాగా, షఫీ, సాధిక్ శరీరంపై కత్తిగాట్లు, రక్తపు గాయాలు కనిపించాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గ్రేటర్@42.8 డిగ్రీలు

రాగల 48 గంటల్లో వర్ష సూచన

సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ): ఎండలతో మండిపోతున్న నగరానికి ఎట్టకేలకు చల్లని కబురు చెప్పింది వాతావరణ శాఖ. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రానున్న 48 గంటల్లో గ్రేటర్‌లోని పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశమున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇప్పటికే ఆదివారం రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురిసిన వర్షం ప్రభావంతో నగర ఉష్ణోగ్రత స్వల్పంగా తగ్గింది. గత మూడు నాలుగు రోజులుగా 43 డిగ్రీలు దాటి నమోదవుతున్న పగటి ఉష్ణోగ్రతలు ఆదివారం కొంత తగ్గు ముఖం పట్టాయి. కానీ రాత్రి ఉష్ణోగ్రతలు మాత్రం 30 డిగ్రీలకు చేరువ కావడంతో రాత్రి సమయంలో తీవ్రమైన ఉక్కపోత నెలకొంది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 42.8, కనిష్ఠం 29.3 డిగ్రీలు, గాలిలో తేమ 16 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో
గృహిణికి రూ. 23.44 లక్షలు టోకరా

సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ): యూట్యూబ్ సబ్‌స్క్రిప్షన్, లింక్స్ క్లిక్ చేసే పార్ట్‌టైమ్ ఉద్యోగమంటూ నమ్మించి, ఒక గృహిణి వద్ద నుంచి సైబర్‌నేరగాళ్లు రూ. 24.33 లక్షలు స్వాహా చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన బాధితురాలికి టెలీగ్రామ్ యాప్‌లో పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో ఒక మెసేజ్‌తో పాటు లింక్ వచ్చింది. ఆమె ఆ లింక్‌ను క్లిక్ చేయడంతో నియమ నిబంధనలు ఆ వెబ్‌సైట్‌లో చూపించారు. నిజమని నమ్మిన బాధితురాలు సైబర్‌నేరగాళ్ల సూచనలు పాటిస్తూ ముందుకెళ్లిన ఆమె తన పేరు రిజిస్ట్రేషన్ చేసుకుంది. ఆ తరువాత సైబర్‌నేరగాళ్లు కొన్ని యూట్యూబ్ లింక్స్ ఇచ్చి వాటిని సబ్‌స్క్రైబ్, లైక్ చేసి స్క్రీన్ షాట్స్ పంపించాలని సూచించడంతో ఆమె అలాగే చేసింది. మొదట్లో సైబర్‌నేరగాళ్లు కొన్ని డబ్బులు ఆమె ఖాతాకు బదిలీ చేశారు. దీంతో ఆమె అది నిజమని నమ్మింది. మీరు ఎక్కువగా డబ్బు సంపాదించాలంటే కొంత పెట్టుబడి పెట్టి టాస్క్‌లు తీసుకోవాలని, అలా చేయడం వల్ల భారీగా డబ్బు సంపాదించేందుకు అవకాశం ఉంటుందని సూచించారు. బాధితురాలు వారి మాటలు నిజమని నమ్మి, సైబర్‌నేరగాళ్లు సూచించినట్లు దఫ దఫాలుగా డబ్బులు ఇన్వెస్ట్ చేస్తూ రూ. 24.33 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయింది. ఇంకా డబ్బులు పెట్టుబడి పెట్టాలంటూ.. సైబర్‌నేరగాళ్లు సూచిస్తుండటంతో ఇదంతా మోసమని తెలుసుకున్న ఆమె సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

డబ్బుల కోసం వ్యాపారికి బెదిరింపులు

కేసు నమోదు చేసిన పోలీసులు

బంజారాహిల్స్, మే 5: డబ్బులు ఇవ్వకపోతే అంతుచూస్తామంటూ వస్త్ర వ్యాపారిని బెదిరించిన వ్యక్తులపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మల్లేపల్లికి చెందిన షానవాజ్‌ఖాన్ బంజారాహిల్స్ రోడ్ నం. 10లో మధు సిల్క్ భండార్ పేరుతో వస్త్రాల వ్యాపారం చేస్తుంటాడు. మూడేండ్ల కిందట తన భార్యతో విడాకులకు సంబంధించిన వ్యవహారాల్లో అతడికి సహకరించిన సలామ్ పహిల్వాన్ అనే వ్యక్తికి అప్పట్లో షానవాజ్ ఖాన్ కొంత డబ్బు ఇచ్చాడు. అప్పటి నుంచి అవసరం వచ్చినప్పుడల్లా ఎంతో కొంత మొత్తం తీసుకుంటున్న సలామ్ పహిల్వాన్ ఆగడాలు ఇటీవల ఎక్కువయ్యాయి. నెలన్నర కిందట సలీమ్ పహిల్వాన్‌తో పాటు అతడి సోదరుడు సల్మాన్ తదితరులు షాపు వద్దకు వచ్చి వీరంగం సృష్టించారు. తమకు అర్జెంట్‌గా రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వద్ద డబ్బులు లేవని చెప్పగా.. తనతో పాటు తండ్రిని కూడా బూతులు తిడుతూ బెదిరింపులకు గురిచేశారు. దీంతో తీవ్ర ఆందోళన చెందిన షానవాజ్ ఖాన్ వారికి రూ.5 లక్షలు ఇచ్చాడు. మరోసారి తన వద్దకు రావద్దని చెప్పాడు. అయినా, తిరిగి షాపు వద్దకు వస్తుండటంతో పాటు డబ్బులు ఇవ్వాలంటూ వేధిస్తున్నారు. విసిగిపోయిన షానవాజ్ ఆదివారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సలామ్ పహిల్వాన్, సల్మాన్ తదితరులపై ఐపీసీ 448, 384, 506, 509 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

పబ్లిక్ హెల్త్ ఈఎన్సీగా..
జియావుద్దీన్ బాధ్యతల స్వీకరణ

సిటీబ్యూరో, మే 5, (నమస్తే తెలంగాణ): రాష్ట్ర మున్సిపల్ శాఖ పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా మహమ్మద్ జియాఉద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఈఎన్‌సీగా పనిచేసిన శ్రీధర్ పదవీ విరమణ చేసిన నేపథ్యంలో జీహెచ్ఎంసీలో ఈఎన్‌సీగా పని చేస్తున్న జియాఉద్దీన్‌కు రాష్ట్ర పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా బాధ్యతలు అప్పగించారు. ఏపీపీఎస్సీ ద్వారా 1987లో డిప్యూటీ ఇంజినీర్‌గా డైరెక్ట్ నియామకమై.. వివిధ హోదాల్లో పలు చోట్ల పనిచేశారు. ఈఈగా 8, ఎస్ఈగా రెండు సంవత్సరాలు పనిచేశారు. హైదరాబాద్ మెట్రో రైల్ నిర్మాణంలో భాగస్వాములై విశేషంగా కృషి చేశారు. చీఫ్ జనరల్ మేనేజర్‌గా, సీఈ హోదాలో డిప్యూటేషన్‌పై పనిచేశారు. ఆ తర్వాత ఇంజినీరింగ్ చీఫ్‌గా పదోన్నతి పొంది జీహెచ్ఎంసీలో 2017 నుంచి పనిచేశారు. రాష్ట్ర పబ్లిక్ హెల్త్ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా నియమించడంతో పాటు జీహెచ్ఎంసీలో ఇంజినీరింగ్ చీఫ్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించాల్సిందిగా ప్రభుత్వం ఆ ఉత్తర్వులలో పేర్కొన్నది. తన సర్వీస్‌లో ఎన్నో ఉత్తమ అవార్డులను జియావుద్దీన్ అందుకున్నారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొని పలు నిర్మాణ సంబంధించిన కార్యక్రమాలపై వివరించారు. ఉస్మానియా యూనివర్సిటీలో స్ట్రక్చర్ ఇంజినీరింగ్‌లో ఎంఈ 1986లో పూర్తిచేశారు. 2003లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఇంజినీర్‌గా అవార్డు పొందారు. జీహెచ్ఎంసీలో నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు వినూత్న పథకాలు రూపొందించి అమలు చేశారు.

బాల్కనీ పైనుంచి పడి..

సుల్తాన్‌బజార్, మే 5: బాల్కనీ పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కుల్సుంపుర పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ రామస్వామి కథనం ప్రకారం.. కార్వాన్ భంజవాడిలో నివసించే శ్రీధర్(50) ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు. రెండో అంతస్తు బాల్కనీ నుంచి అతడు కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే సమీపంలోని దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

యశోదలో బ్రెస్ట్ క్యాన్సర్‌పై సింపోజియం

జూబ్లీహిల్స్, మే 5: నగరంలోని యశోద హాస్పిటల్స్‌లో అంతర్జాతీయ బ్రెస్ట్ క్యాన్సర్ సింపోజియం విజయవంతంగా జరిగింది. ఈ సింపోజియంను హైదరాబాద్‌లోని యూఎస్ కాన్సులేట్‌లోని చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ రాఘవన్ శ్రీనివాసన్, ఐపీఎస్ అధికారి శిఖా గోయల్, యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటితో కలిసి ప్రారంభించారు. రొమ్ము క్యాన్సర్ సంరక్షణలో అభివృద్ధి చెందుతున్న వైద్య విధానాలు, సవాళ్లపై నిర్వహించిన ఈ సదస్సుకు మంచి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ సర్జికల్ ఆంకాలజిస్ట్, సింపోజియం ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ చినబాబు మాట్లాడుతూ.. ఈ అంతర్జాతీయ సింపోజియం రొమ్ము క్యాన్సర్‌ను ఎదుర్కోవడంలో పరిశోధన, రోగ నిర్ధారణ, చికిత్స పద్ధతుల పురోగతి ప్రదర్శనకు దోహదపడినట్టు తెలిపారు. సదస్సును ఉద్దేశించి డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. ప్రపంచస్థాయి సేవలను అంకితభావంతో అందించడంతో పాటు రొమ్ము క్యాన్సర్‌పై పరిశోధన, రోగుల సంరక్షణకు ప్రదర్శిస్తున్న నిబద్ధత స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయన్నారు. ఈ సదస్సుకు అంతర్జాతీయ అధ్యాపకులు డాక్టర్ రెగిస్ పాలినెల్లి, డాక్టర్ రిషికేశ్ పరమేశ్వర్, జాతీయ అధ్యాపకులు డాక్టర్ చైతన్యానంద కొప్పికర్, డాక్టర నరేంద్ర హుళికల్, డాక్టర్ వాణి పర్మార్, డాక్టర్ శలాక జోషి, డాక్టర్ అశోక్ బీసీ, డాక్టర్ జ్యోతి బాజ్‌పాయ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ఈసదస్సులో ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్యాన్సర్ వైద్య నిపుణులు, న్యాయవాదులు, వాటాదారుల సుదీర్ఘ చర్చలు, సంచలనాత్మక పరిశోధనల ప్రదర్శనలతో క్యాన్సర్‌పై పోరాటంలో అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించడానికి ఒక వేదికగా నిలిచింది. ఈ సదస్సులో 500 మందికి పైగా సర్జన్లు, గైనకాలజిస్టుల ఇంటరాక్టివ్ సెషన్లు, ప్యానెల్ చర్చలు, ఆయా రంగాల్లోని ప్రముఖుల ప్రసంగాలతో విజయవంతంగా ముగిసింది.

ఆఫీసు వదిలి..
క్షేత్ర స్థాయిలో విధులు

విద్యుత్ శాఖలో పని విధానంలో కొత్త మార్పులు

సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ): ఎండల తీవ్రతతో విద్యుత్ డిమాండ్ రోజు రోజుకు గణనీయంగా పెరుగుతోంది. గ్రేటర్ హైదరాబాద్‌లో మే మొదటి వారంలో ఒకే రోజు 89.71 మిలియన్ యూనిట్ల కరెంటు వినియోగం రికార్డయింది. ఈ నేపథ్యంలో డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ విద్యుత్ శాఖలో పని విధానంలో కొత్త మార్పులకు శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు కార్పొరేట్ కార్యాలయం, జోనల్, సర్కిల్ కార్యాలయాల్లోనే పనిచేసే సాంకేతిక సిబ్బంది క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించాలని ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు. చీఫ్ జనరల్ మేనేజర్లుగా పనిచేస్తున్న 10 మంది ఉన్నతాధికారులకు సర్కిళ్ల పరిధిలో విద్యుత్ సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశాలిచ్చారు. వీరితో పాటు కింది స్థాయిలో ఉన్న అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి విధులు నిర్వహించాలంటూ..ఆదేశాలు జారీ చేశారు. ఖైరతాబాద్‌లోని కార్పొరేట్ కార్యాలయంలో పని చేస్తున్న 54 మంది డీఈలు, 55 మంది ఏడీఈలు, 82 మంది అసిస్టెంట్ ఇంజినీర్లు (ఏఈ)సర్కిళ్ల వారీగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

హైదరాబాద్ స్థానంలో..
30 మంది బరిలో..



సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను కేటాయించామని హైదరాబాద్ రిటర్నింగ్ అధికారి అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టరేట్‌లో ఆదివారం పార్టీ అభ్యర్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అనుదీప్ మాట్లాడుతూ.. హైదరాబాద్ పార్లమెంటు స్థానంలో 30 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారని వెల్లడించారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు వాహన అనుమతులు తీసుకోవాలన్నారు. 10 పోలింగ్ స్టేషన్లకు ఒక సెక్టోరల్ అధికారిని నియమించినట్టు వివరించారు. ఎన్నికల సమయంలో పనిచేయని యంత్రాల స్థానంలో సీసీటీవీ వీడియో కవరేజీ సమక్షంలో 20 నిమిషాల్లోనే మరొకటి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జనరల్ అబ్జర్వర్ శ్రీ విద్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ మరింత పటిష్టం

హెచ్ఎండీఏ భూముల పరిరక్షణకు చర్యలు

సిటీబ్యూరో, మే 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన హెచ్ఎండీఏ భూముల పరిరక్షణకు ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రత్యేకంగా చర్యలు చేపట్టింది. ఏడు జిల్లాల పరిధిలో విస్తరించి ఉన్న హెచ్ఎండీఏకు సుమారు 8,457 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ భూములు కోర్ సిటీతో పాటు నగర శివారు ప్రాంతాలు, ఔటర్ రింగు రోడ్డు బయట కూడా ఉన్నాయి. ప్రధానంగా నగర శివారులోని జవహర్‌నగర్‌లో ఒక్క చోటే హెచ్ఎండీఏకు 3 వేల ఎకరాల వరకు భూములు ఉన్నాయి. అందులో పెద్ద మొత్తంలో కబ్జాలు కాగా.. మిలిగిన భూములను కాపాడేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టారు. అదేవిధంగా, శంషాబాద్, మియాపూర్, బుద్వేల్, కోకాపేట, వట్టినాగులపల్లి, ఉప్పల్ భగాయత్, బంజారాహిల్స్, మాదాపూర్ ప్రాంతాల్లో వందలాది ఎకరాలు భూములు ఉన్నాయి. వీటన్నింటినీ రక్షించేందుకు ఎస్టేట్ విభాగం నుంచి ఏడుగురు సైట్ ఆఫీసర్లు క్షేత్ర స్థాయిలోని భూములను నిరంతరం పర్యవేక్షిస్తుండగా, వారికి అదనపు బలంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పోలీసులు సైతం క్షేత్ర స్థాయిలోభూముల రక్షణను పర్యవేక్షిస్తున్నారు. ఇటీవలే హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీగా జానకీరెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టగా, సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మరో పోలీసు అధికారి తిరుపతి బదిలీపై వచ్చారు. వీరితో పాటు ఎస్ఐ, కానిస్టేబుళ్లు, హోంగార్డ్స్‌తో కూడిన పోలీసులు బలగాలు హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో ఉన్నారు. అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయానికే పరిమితం కాకుండా క్షేత్ర స్థాయిలో హెచ్ఎండీఏకు ఉన్న భూములను పర్యవేక్షించేందుకు సీఐ, ఎస్ఐలతో పాటు కానిస్టేబుళ్లు సైతం వెళ్లి అక్కడి పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకొని మెట్రోపాలిటన్ కమిషనర్‌కు నివేదిక ఇస్తున్నారు. భూముల పరిరక్షణ విషయంలో చాలా కచ్చితంగా వ్యవహరించాలని అటు ఎస్టేట్ ఆఫీసర్‌కు, ఇటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీలకు మెట్రోపాలిటన్ కమిషనర్ దాన కిశోర్ ఆదేశాలిచ్చారు. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎక్కడెక్కడ ఎన్ని ఎకరాల భూములున్నాయి, వివాదాలు, కోర్టు కేసులు, కబ్జాలకు అవకాశం ఉన్న భూముల వివరాలను అధ్యయనం చేసి చర్యలు తీసుకుంటున్నారు.

స్థానిక పోలీసుల సహకారం కూడా..

హెచ్ఎండీఏ భూములను ఎవరైనా ఆక్రమించాలని, అక్రమ కట్టడాలు చేపట్టాలని ప్రయత్నం చేసినా వెంటనే అప్రమత్తమై అడ్డుకునేలా చర్యలు తీసుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఉన్నతాధికారి తెలిపారు. స్థలాల వద్ద ఎలాంటి వివాదాలు తలెత్తినా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లకు సమాచారమిచ్చి, అక్కడికి వెళ్లి పరిస్థితులను చక్కదిద్దేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పనిచేస్తుందని తెలిపారు. ఇందుకోసం హెచ్ఎండీఏ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అన్ని పోలీస్ స్టేషన్ల సహకారం తీసుకుంటున్నదని తెలిపారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడమే ప్రధాన కర్తవ్యంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పనిచేస్తున్నదన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

GOLD FINANCE

★మీ బంగారం బ్యాంకుల్లోగానీ, మార్వాడీ షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా, మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. Ph: 9100329739. NT-328121

PACKERS & MOVERS

★Sri Sai Packers & Movers Local and all over India, Resonable Price. Head Office Nacharam: 27176927, Ameerpet: 9866379391, DSNR: 9666993927, KKP: 9949513929, MP: 9848263927, ECIL: 9666983927. NT-328125

PEST CONTROL



★చెదలు, బొద్దింకలు నివారణ: న్యూ కన్‌స్ట్రక్షన్ ట్రీట్‌మెంట్ 10 సంవత్సరాల గ్యారెంటీ మరియు శానిటైజర్ స్ప్రే కొరకు సంప్ర: 9392468282, 8333030227. NT-327882

OLD AGE HOME

★వృద్ధులు & భార్యాభర్తలు A/C & N/C అటాచ్డ్ బాత్‌రూమ్, మేడిపల్లి/ ఉప్పల్, వృద్ధులు, బెడ్ పేషెంట్లు, ECIL, చీర్యాల్ 'X' రోడ్, భోజన వసతి మరియు 24/7 మెడికల్ సర్వీస్. ఫోన్: 7981467036, 9391039990, 9515474083. NT-311886

TOURS & TRAVELS

★మహదేవ టూర్స్: 26/5 చార్‌ధాం, 11/6 నేపాల్ ముక్తినాథ్, 7/7 నవాదేవి అమరనాథ్, 10/7 వైష్ణవి అమరనాథ్ @ 9908844377 NT-311998

LAND FOR SALE

★శ్రీశైలం హైవేలో 12 ఎకరాలు DTCP లేఅవుట్ LP No. వచ్చింది మార్కెటింగ్‌కు ఇవ్వబడును. అడ్వాన్స్ రూ||లు కంపల్సరీ ఉంటుంది. 9177619716. NT-328341

HOUSE FOR SALE

★New Maruthi Nagar, Dr. A.S. Rao Nagar, ECIL, House for Sale in 323 sq. yds, East Face, 25' Feet Road, @ 2 Cr. Ph: 9959151595 NT-328136

WANTED

★రియల్ ఎస్టేట్ సంస్థ కొరకు సొంత కారు ఉండి, మా కంపెనీలో మార్కెటింగ్ చేయుటకు అనుభవము కల్గిన వారికి ఇదే మా ఆహ్వానం. సంప్రదించండి: 7981217883 NT-339501

అర్జెంటుగా కావలెను

★RTC లో పనిచేయుటకు ITI Motor, Diesel Machanics, Electricians and సెక్యూరిటీ గార్డ్స్ కావలెను (వసతి సౌకర్యం కలదు) Ph: 040-66366664, 9246663777, 9392663777. NT-311994

వేదమూర్తులు కావలెను

★వివాహము, ఉపనయనము, పుట్టినరోజు, వ్రతములు, కర్మ నిర్వహించుటకు, శైవ, వైష్ణవ, వేదమూర్తులు కావలెను. సంప్రదించండి: 9951868349 NT-311997

CHANGE OF NAME

★I, Talati Hetkumar Snehal S/o, Snehal Dipakkumar Talati R/o 6, Raghuvir Row House, City Light Road, Surat, Surat City, Gujarat - 395007 have changed my name to Talati Het Snehalkumar for all purposes. NT-10892

★I, SYED SHAFI ULLAH QUADRI, R/o: 14-5-192, Chudi Bazar, Begum Bazar, Hyderabad., changed my name as SYED SHAFI ULLAH QUADRI, S/o ABDUL RAZZAK for all my future purposes. NT-334258

★I, SYED SHAKEEL, R/o: 14-5-192, Baider Wadi, Begum Bazar, Hyderabad. T.S., changed my name as SYED SHAKEEL ULLAH QUADRI S/o SYED SHAFI ULLAH QUADRI for all my future purposes. NT-334258

★I, KAIROMKONDA SRINIVAS SRIKANTH (Old Name) S/o K.N. SrinivasRao, H.NO: 3-2-705, Kachiguda, Hyderabad. 500027. I have changed my name to KAIRAMKONDA SRINIVAS SRIKANTH (New Name) forever. NT-334258

★Vikram Aditya Kodalapuram, R/o: HNo: 3-6-519, Flat No: 304, Sai Pragati Towers, Himayatnagar, Hyderabad - 500029, Telangana have changed my name from "Indumathi Limbekar" to "Indumathi Vidya Shankar Limbekar" NT-334258

★I, Badur Unnisa Begum Alias Bader Unnisa Arif D/o Mohammed Ahmed Mohiuddin W/o Syed Abdul Haque residing at House No. 16-7-195, Azampura Po Sahifa, Saidabad, Hyderabad, Telangana 500024 have changed my name to **Bader Unnisa Arif** for all future purposes. NT-327610]

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

4 లైన్లకు రూ.400/- (5% GST అదనం) ప్రతి అదనపు లైనుకు రూ.75/-

Cell: 9848077857

: 9182777202
: 9182777126
: 9182777805
: 9182777806
: 9182777204
E.C.I.L: 9182777125
: 9182777209
: 9182777205